

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-పెదబయలు : అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు జామిగూడ పంచాయతీ పినరావేలి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎల్ పూర్ణయ్య, మండల విద్యాశాఖధికారి కె కృష్ణమూర్తి శనివారం సందర్శించారు. శుక్రవారం స్పందనలో పాఠశాల శిదిలావస్థపై వచ్చిన వినతి మేరకు పాఠశాలను సందర్శించడం జరిగిందన్నారు ..



విద్యార్థులను ప్రశ్నిస్తున్న అధికారులు

జిఒ117తో విద్యా వ్యవస్థకు పెను ముప్పు

-ఫ్యాప్టో ఆధ్వర్యంలో భారీ నిరసన- పలు సంఘాల నేతల మద్దతు

ప్రజాశక్తి-పాడేరు: ఉపాధ్యాయుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరు, జిఒ 117 ను రద్దు చేయాలని ఫ్యాప్టో ఆధ్వర్యంలో వివిధ ఉపాధ్యాయ సంఘాలు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శనివారం సామూహిక నిరసన కార్యక్రమం నిర్వహించాయి. స్థానిక అంబేద్కర్ సెంటర్లో 12 గంటలపాటు చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి జిల్లాలోని 22 మండలాల నుంచి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం తరఫున జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.నీలకంఠం, శోభన్‌బాబు హాజరై నిరసనకు మద్దతు తెలిపారు. సిపిఎస్, 117 జీవో రద్దు చేయాలని, ఉపాధ్యాయుల పట్ల ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ వైఖరి మారాలని, రెండు నెలలు కిందట నెలలు బదిలీ అయిన ప్రధానోపాధ్యాయులు, ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు మంజూరు చేయాలని ఉపాధ్యాయులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర నేత పి.అప్పలనరస మాట్లాడుతూ, ఉపాధ్యాయుల పోరాటాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలకు పూనుకోవడం సరికాదన్నారు. ఉపాధ్యాయుల పోరాటాలను అణిచివేతకు ప్రభుత్వం ప్రవీణ్ ప్రకాష్ వంటి అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు తేటతెల్లమవుతోందన్నారు. సిపిఎస్ రద్దు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు దాసోహమై ఆదివాసీల హక్కుల్ని కాలరాస్తున్నాయని దుయ్యబట్టారు. గిరిజనులకు నూరు శాతం రిజర్వేషన్ కల్పించే జీవో 3 పునరుద్ధరణకు, నూతన అటవీ చట్టం రద్దు కోసం జరుగుతున్న పోరాటాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయ వర్గాలు భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో అల్లూరి జిల్లా చైర్మన్ రావుల జగన్మోహన్, ప్రధాన కార్యదర్శి ముఖి రామకృష్ణ, వైస్ చైర్మన్ వెంకటరమణ, జేఏసీ కన్వీనర్ రామారావు దొర, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ముఖి శేషాద్రి మాట్లాడుతూ, జీవో 117తో విద్యావ్యవస్థ సంక్షోభంలో పడుతుందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఉపాధ్యాయులపై కక్ష సాధించే ధోరణిని ప్రభుత్వం విడనాడాలని, ఉపాధ్యాయులపై ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దుష్ప్రచారాలను విడనాడాలన్నారు. ఉపాధ్యాయులను కించపరిచే పద్ధతులు సమాజానికి మంచిది కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీ ఎస్సిఈఎ జిల్లా అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి బి.సింహాచలం, జేఏసీ నాయకుడు ఎస్ గంగరాజు, జిల్లాలోని వివిధ మండలాల ఉపాధ్యాయులు, ఆయా సంఘాల నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలనర్స



నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

పాడేరులో యుటిఎఫ్ ర్యాలీ

ప్రజాశక్తి-పాడేరు: స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) ఆవిర్భావ దినోత్సవంత సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. జాతీయ నూతన విద్యా విధానం, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు నినాదాలు చేశారు. గిరిజన సంఘం భవనం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ అల్లూరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై విల్సన్‌బాబు, వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నూతన విద్యా విధానం పేరుతో 117 జీవో తీసుకొచ్చి విద్యా విధానాన్ని ప్రైవేటుపరం చేయడానికి పునాదులు వేస్తున్నారని విమర్శించారు. దీనిలో భాగంగానే పాఠశాల విద్యా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను నియమించి ఉపాధ్యాయులను వేధించడమే కాకుండా సరిగ్గా పని చేయలేదనే సాకులతో సమాజం దృష్టిలో ఉపాధ్యాయులని తక్కువగా చేసి చూపించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇటువంటి దుష్ప్రచా రాలతో సమాజంలోని పేద, గిరిజన, దళిత విద్యార్థులు ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉందనిఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటికీ పరిష్కారంగా కామన్ స్కూల్ ఎడ్యుకేషన్ పద్ధతిని తీసుకు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సిపిఎస్ విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు మానసిక ఆందోళనలో ఉన్నారన్నారు. సర్వీస్ చేసిన తర్వాత వృద్ధాప్యంలో భద్రత లేకుండా జీవిచడం ఎంతో కష్టంగా ఉంటుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే నూతన విద్యా విధానం, సిపిఎస్ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ యం.ఉదయ్ కుమార్, కార్యదర్శులు కే.రఘునాథ్, పి.దేవుడు, ఎం.ధర్మ, కె.ఆదిరెడ్డి, సిహెచ్ నాగేశ్వరరావు, కర్రి బాబు, పైడిమళ్ల రమణ, శ్రీను, రమేష్, రాంబాబు, సత్యనారాయణ, విజయ్ కుమార్, గంగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

నిర్వాసితులకు నిరాశ మిగిల్చిన ముఖ్యమంత్రి

- సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి-కూనవరం

వరదల వల్ల నష్టపోయిన నిర్వాసితులను కలిసేందుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పోలవరం ఆర్ అండ్ ఆర్, పునరావాస ప్యాకేజీ ఇచ్చి తరలిస్తారని భావిస్తే తీవ్ర నిరాశే మిగిల్చారని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. మండలంలోని పెదర్కూర్‌లో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి మాట్లాడిన తీరు చుస్తే ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ తమబలం తగ్గుతుందనే భయంతో వచ్చారే తప్ప నిర్వాసితులకు న్యాయం చేయడానికి రాలేదని స్పష్టమవుతుందని పేర్కొన్నారు. ప్రతి నిర్వాసితుడు తమ బాధలు చెప్పుకుందామనుకుంటే, ఎంపిక చేసిన వారినే సభకు అనుమతి ఇచ్చారన్నారు. గతేడాది వచ్చిన వరదలలో నెలలు తరబడి కష్టాలు పడ్డారని, అయినా నాడు ఎవరూ పట్టించుకోలేదని, ఇప్పుడు సీఎం జగన్మోహన్‌రెడ్డిని చూసేసరికి అధికార పార్టీ నాయకులు సమస్యలు మర్చిపోయారా? అని ఏద్దేవా చేశారు.

పునరావాస గ్రామాలను కేంద్రం ఆమోదం చేయలేదని ముఖ్యమంత్రి వేదికపై చెప్పారని, లిడార్ సర్వే పేరుతో మోసం చేశారని, గతేడాది వచ్చిన వరదలకు ఎన్ని గ్రామాలు మునిగి నష్టపోయాయో తెలియదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది మునిగిన ప్రతి గ్రామానికి ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలో ప్యాకేజీ ఇస్తామని చెప్పి మళ్ళీ మోసం చేశారని, త్వరలో ఎన్నికలు వస్తుంటే ఎలాగా ఇస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రాకకోసం కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, అయినా నిర్వాసితులకు ఉపయోగం లేకుండా పోయిందని పేర్కొన్నారు. నిర్వాసితుల సమస్యలపై నిరంతరంగా పోరాడుతున్న సిపిఎం ఢిల్లీలో సైతం నిర్వాసితుల గళం విప్పిందని తెలిపారు. ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా నిర్వాసితుల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, ఆవుల మురళి, పాయం సత్యనారాయణ, సర్పంచ్ బొగ్గా రామారావు, కుంజా రాధ, తాళ్లూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, పాయం జ్యోతి, బొగ్గా సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జిల్లా శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి ఎస్.సునీత ఆధ్వర్యంలో శనివారం గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రంథాలయ అధికారిణి సునీత మాట్లాడుతూ, గ్రంథాలయాలు గ్రామాల్లో విజ్ఞాన దేవాలయాలు వంటివని చెప్పారు. కాంపిటేటివ్ పుస్తకాలతో పాటు కథలు, ఇతర పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని చదివి అనేకమంది వివిధ రంగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు గ్రంథాల అధికారిని ఎం.సత్యవతి, జిమాడుగుల గ్రంథాలయ అధికారి వి.మహేష్, హుకుంపేట గ్రంథాల అధికారి ఏఎస్ అప్పారావు, ఎస్.సునీల్, ఓఎస్ కే.సుబ్బారావు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



రంగనాథన్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న గ్రంథాలయాధికారి



సెర్ప్ సిఇఒ కోసం ఎదురు చూస్తున్న బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, సిపిఎం, గిరిజన సంఘం నేతలు

ఎఫ్‌పిఒలో అవకతవకలపై మాట్లాడని సెర్ప్ సిఇఒ

- తక్షణమే పూర్తి స్థాయి విచారణ చేపట్టాలి

- సిపిఎం, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి-రంపచోడవరం

రైతు ఉత్పత్తి దారుల సంఘం (ఎఫ్‌పిఒ)లో జరుగుతున్న అవకతవకలపై కొంతమంది బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంపచోవవరం వచ్చిన సెర్ఫ్ సిఇఒ, వాటిపై మాట్లాడకుండా వెళ్లిపోవడం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఇ.సిరిమల్లి రెడ్డి పేర్కొన్నారు. రంపచోడవరంలో సెర్ఫ్ సీఈవో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా సీఈవోకు సమస్యలను వివరించడానికి ఎదురుచూస్తున్న బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ (బిఒడి)లను సిపిఎం, గిరిజన సంఘం నేతలు కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాణిశ్రీ, సిరిమల్లిరెడ్డి మాట్లాడుతూ ఎఫ్‌పిఒలో అవకతవకలపై ఈ నెల 7న కొంత మంది బిఒడిలు విజయవాడ వెళ్లి సెర్ఫ్ అడిషనల్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనికి స్పందించిన ఆయన సెర్ఫ్ సీఈవోని పంపించి సమస్యలన్నీ సరి చేస్తామని హామీ ఇచ్చారని, ఆ మేరకు రంపచోడవరంలో సెర్ఫ్ సీఈవో పర్యటించారని చెప్పారు. అయితే రంపచోడవరం వచ్చిన సీఈవో, ఎపిఓల అవకతవకలపై బిఒడిలతో మాట్లాడకుండా వెనక్కి వెళ్లిపోటం దారుణమన్నారు. వెలుగు ఎపిడి తప్పుదారి పట్టించటం వల్లే సీఈవో వెళ్లిపోయారని, లేకపోతే ఎందుకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌తో మాట్లాడలేదని ప్రశ్నించారు. ఈ అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని, వెంటనే లెక్క తేల్చి ఎఫ్‌పిఒ ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. 2017లో సంస్థ ప్రారంభంలో రూ.65 లక్షలు ఇచ్చారని, సుమారు రూ.32.90 లక్షల జమఖర్చులు చూపిస్తున్నారని, మిగతా సొమ్ము ఏమయ్యిందో లెక్క చెప్పటం లేదని తెలిపారు. అడిగితే రూ.21 లక్షలు మాత్రమే మీకు జమ అవుతాయని చెబుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సెర్ఫ్ అధికారులు స్పందించి బిఒడిల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఒడిలు రేవుల జానకి రెడ్డి, పల్లాల చిన్నారెడ్డి, ములవాడ కమలాకర్, కదల మొట్టిరెడ్డి, ఎస్.భారతి తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న కిల్లో సురేంద్ర

మెగా వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని సుంకరమెట్ట పంచాయితీలో కేంద్రంలో సుంకరమెట్ట సర్పంచ్ చిన్న బాబు ఆధ్వర్యాన మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పంచాయతి పరిధిలో సుమారు 18 జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. గెలుపొందిన విజేతలకు ఆగస్టు 15 తేదీన బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని తెలిపారు. యువత క్రీడల్లో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పి.నానిబాబు, వివిధ టీమ్ కెప్టెన్స్, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.





మృతదేహాన్ని గ్రామానికి తరలిస్తున్న గిరిజనులు, పేలిన నాటు తుపాకీ ఇదే..

నాటు తుపాకీ పేలి గిరిజనుడు మృతి

ప్రజాశక్తి- పెదబయలు : అడవి పంది వేటకు అడవికి వెళ్లిన బృందం సభ్యుల్లో ఒకరు ప్రమాదవశాత్తు నాటుతుపాకి పేలడంతో మృతి చెందిన ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లాలో చోటు చేసుకుంది. పెదబయలు మండలం వనుకొంతూరు కొండల్లో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జి.మాడుగుల మండలం మారుమూల కిల్లంకోట పంచాయతీ కప్పలు గ్రామానికి చెందిన ఐదుగురు గిరిజనులు శుక్రవారం ఉదయం అటవీ ప్రాంతంలో వేటకు వెళ్లారు. కొండలు, గుట్టలు దాటుకుంటూ వెళుతున్న క్రమంలో బుటారి బొంజుబాబుకు అడవి పంది అడుగు జాడలు కనిపించాయి. అడవి పంది అడుగు జాడలు చూస్తూ ముందుకు వెళుతున్న క్రమంలో వెనుక ఉన్న ఎంర్రపల్లి సూరిబాబు చేతిలోని నాటు తుపాకి ప్రమాదవశాత్తు పేలడంతో బుటారి బొంజుబాబు శరీరంలోకి బుల్లెట్లు చొచ్చుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జి.మాడుగుల సిఐ సత్యనారాయణ, ఎస్సై శ్రీనివాస్ పోలీస్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. నాటుతుపాకి స్వాధీనం చేసుకొని, వేటకు వెళ్లిన మరో నలుగురు బుటారి మాలన్న, వెంబరి సుబ్బారావు, బుటారి సింహాచలం, ఎంర్రపల్లి సూరిబాబులను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం జి.మాడుగుల పోలీస్ స్టేషన్ కు తరలించారు. బుటారి బొంజుబాబు మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.



సాగునీరు లేక వరి నాట్లు వేయకుండా ఖాళీగా ఉన్న పొలం



ముదురుపోతున్న వరి నారు

సాగునీటి కష్టాలు

- ఎండిపోతున్న ఉడుపు పొలాలు, నారు మడులు
- ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఆరుగాలం శ్రమించి రైతులు వేసిన ఉడుపు పొలాలకు, వరి నారుమడులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇటీవల అడపాదడపా ఖరీఫ్ సీజన్‌లో పడిన వర్షాలకు రైతులు వరి నారు వేశారు. కొన్నిచోట్ల రైతులు ఉడుపులు ముగించారు. ఇంకా చాలా చోట్ల సాగునీరు లేకపోవడంతో ఉడుపులు పూర్తిస్థాయిలో జరగలేదు. అయితే వారం రోజులుగా వరుణుడు మొఖం చాటేయడంతో సాగునీరు లేక చాలాచోట్ల వరి ఉడుపు మడులు నెర్రెలు బారుతున్నాయి. ఆకుమడులు ఎండిపోతున్నాయి.

రాజవొమ్మంగి మండలంలోని ఒట్టిగెడ్డ రిజర్వాయర్ ద్వారా తంటికొండ, దూసరిపాము, రాజవొమ్మంగి, అప్పలరాజుపేట తదితర గ్రామాల రైతులకు చెందిన వందలాది ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే ఈ రిజర్వాయర్‌కు ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడం, గట్టులను పటిష్ట పరచకపోవడం వలన సాగునీరు వృథాగా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు అందించే ప్రధాన కాలువ పూడికలు, వ్యర్థాలతో నిండిపోవడంతో శివారు భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. సాగునీటి కోసం రైతులు కొట్లాటుకునే పరిస్థితి మండలంలో కొన్ని గ్రామాల్లో నెలకొంది. ఖరీఫ్ సాగుకు ముందే ఒట్టిగడ్డ రిజర్వాయర్ మరమ్మతు పనులు, కాలువ పూడిక తీత పనులు చేపట్టాలని అనేక మార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా స్పందించే నాథుడే లేడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా వర్షాలు లేకపోవడంతో రిజర్వాయర్ నీటిపైనే రైతులు ఆధారపడ్డారు. సాగునీటి ఇబ్బందుల నేపథ్యంలో అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పొలాలు ఎండిపోతున్నాయి



వరి పొలాలకు నీరు అందక ఎండిపోతున్నాయి. రైతుల సాగునీటి ఇబ్బందుల నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టాలి.

- హెచ్చం కొండబాబు, రైతు, రాజవొమ్మంగి.

ఒట్టిగెడ్డ రిజర్వాయర్ మరమ్మతు పనులు చేపట్టాలి




మండలంలోని వర్షాలు లేక వరి పొలాలు ఎండిపోతున్నాయి. అప్పలరాజుపేట, తంటికొండ, రాజవొమ్మంగి, దూసరపాము గ్రామాల్లో గ్రామాల పంట పొలాలకు సాగునీరు అందించే ఒట్టిగెడ్డ రిజర్వాయర్‌కు మరమ్మతు పనులు తక్షణం చేపట్టి నీరు నిల్వ చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

చీడి శివ, సర్పంచ్, దూసరపాము

శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-అడ్డతీగల

శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపిడిఒ బాపన్న దొర తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బాపన్న దొర అధ్యక్షతన శానిటేషన్ నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ మహిళ పోలీసు, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో శనివారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంతో పాటు మిగిలిన 22 పంచాయతీల్లో శానిటేషన్, ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. అడ్డతీగల మండల కేంద్రంలో శానిటేషన్ నిమిత్తం అన్ని వీధుల్లో పర్యటించారు. వీధుల్లో శానిటేషన్ బాగోలేదని గుర్తించిన ఆయన సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు మంగళవారం నుండి ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అడ్డతీగల గ్రామంలో ప్రజా ప్రతినిధులు, వ్యాపారాస్తులు, మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి శానిటేషన్‌పై ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ బాపన్న దొర

మహిళా మార్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక యూనియన్ బ్యాంక్ పక్కన వైయస్సార్ చేయుత మహిళా మార్ట్‌ను శనివారం స్థానిక ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మహిళా మార్ట్‌లో వంటింటికి అవసరమైన కిరాణా సరుకులు పెర్ఫ్యూమ్, కాస్మోటిక్స్, ప్లాస్టిక్ వస్తువులు, డ్వాక్రా మహిళలు చేసే ఉత్పత్తులు అందుబాటు ధరలో లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, సర్ఫ్ సీఈవో ఇంతియాజ్, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, ఎంపీపీలు బి.శ్రీదేవి, పి వెంకటలక్ష్మి, ఎంపీటీసీలు సర్పంచ్‌లు, శ్రీనిధి ఎండి నాంచారయ్య, సర్ఫ్ డైరెక్టర్లు మహిత, కేశవ్, పిడి మురళి, ఏపీడి శ్రీనివాసరావు, డిపిఎంలు పరమేష్, అపర్ణ, ఏపిఎంలు బి.అప్పారావు, సీసీలు, వీఏవోలు పాల్గొన్నారు.



మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

పెరిగిన న్యూట్రాస్యూటికల్ వినియోగం

ప్రజాశక్తి-మధురవాడ : మూలికలు, పోషకాలతో రూపొందించిన న్యూట్రాస్యూటికల్స్ రోగనిరోధక శక్తికి, సంపూర్ణ నివారణలకు ప్రసిద్ధి చెందాయని, కోవిడ్-19 తరువాత వీటిపై ప్రజలలో అవగాహన, వినియోగం పెరిగిందని బొటానిక్ హెల్త్ కేర్ సంస్థ వ్యవస్థాపకుడు గౌరవ్ సోనీ వెల్లడించారు. తమ సంస్థ పరిశోధనా విభాగం డైరక్టర్ డాక్టర్ హెచ్‌ఎన్.శివప్రసాద్‌తో కలిసి శనివారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన ఆయన స్కూల్ ఆఫ్ ఫార్మశీలో విద్యార్థులను, పరిశోధకులను, అధ్యాపకులను ఉద్దేశించి న్యూట్రాస్యూటికల్స్‌లో భారతీయ ఔషధ మొక్కల ప్రాధాన్యతపై ప్రసంగించారు. భారత దేశ ఔషధ విజ్ఞానం ఆధారంగా వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన మందు మొక్కలు, సుగంధ ద్రవ్యాల నుంచి శాస్త్రీయంగా ఔషధ మూలకాలను వేరుచేసేందుకు ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వారు వివరించారు. అశ్వగంధ, పుసుపు, బకోపా వంటి ఔషధ లక్షణాలు గల భారతీయ మొక్కలను ఉదహరించారు. మానవాళి శ్రేయస్సు కోసం దేశీయ మందు మొక్కలపై విద్యాలయాలలో పరిశోధనలు జరపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ ఫార్మశీ అసోసియేట్ ప్రొఫెసర్ కె.సునీత సంధానకర్తగా వ్యవహరించారు.

ఉత్తమ పాఠశాలగా భీమిలి గురుకులం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ ఏడాది పదో తరగతి పరీక్షలో మంచి ఫలితాలు సాధించిన నేపథ్యంలో స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ కోడి రాంబాబు శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ద్వారా తమకు అవార్డు ఇస్తారని ఉన్నత విద్యా శాఖాధికారుల నుంచి సమాచారం అందినట్లు పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీకి 35 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, విద్యార్థుల రోజు వారీ హాజరు, ఉత్తమ బోధన తదితర అంశాలు ప్రాతిపదికగా ప్రభుత్వం తమ పాఠశాలను ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఇందుకు గాను ఆయన హర్షం వెలిబుచ్చారు.

గీతం ఫిజియోథెరపీ డైరక్టర్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-మధురవాడ : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్స్ మహిళా విభాగం నుంచి జాతీయ స్థాయిలో స్ఫూర్తిదాయకురాలైన నాయకురాలిగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫిజియోథెరపీ డైరక్టర్ డాక్టర్ మాధురీ కాశీ అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన ఫిజియోథెరపీ ప్రథమ జాతీయ సమావేశాలలో వరల్డ్ ఫిజియోథెరపీ అధ్యక్షుడు డాక్టర్ మైక్ ల్యాండ్రీ ద్వారా ఈ అవార్డును డాక్టర్ మాధురీ కాశీ అందుకున్నారు. ఈ సమావేశాలలో ఫిజియోథెరపీ భవిష్యత్తు, నూతన పద్ధతులు, వృత్తినైపుణ్యాలపై జరిగిన చర్చలలో సైతం పాల్గొన్నారు. బ్యాచులర్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రథమ సంవత్సరం విద్యార్థులతో కలిసి సమావేశాలకు హాజరవడంతో పాటు పలు శాస్త్రీయ చర్చలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

ఎస్ఒఎస్‌ను సందర్శించిన సత్యవతి రాథోడ్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌ను తెలంగాణ రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ శనివారం సందర్శించారు. అనాథలకు శాశ్వత అండగా నిలిచేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన నేపథ్యంలో అనాథ పిల్లల సంక్షేమానికి వివిధ రాష్ట్రాల్లో పలు స్వచ్ఛంద సంస్థల పని తీరును అధ్యయనం మంత్రి సత్యవతి రాథోడ్ నేతృత్వంలోని మంత్రి వర్గ ఉప సంఘం అధ్యయనం చేసింది. నివేదికను సిఎం కెసిఆర్‌కు అందజేయగా, అందుకు అనుగుణంగా మరిన్ని అంశాలు ఉండేలా సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని కెసిఆర్ ఆదేశించినందున మంత్రి సత్యవతి రాథోడ్ నేతృత్వంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హోలి కేరి, సిఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, హరిత హారం ఓ ఎస్డీ ప్రియాంక వర్గీస్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ పమేలా సత్పతితో కూడిన ఉన్నతాధికారుల బందం స్థానిక ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌ను సందర్శించింది. విలేజ్ డైరెక్టర్ కోన రవీంద్ర కుమార్, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్ కార్య కలాపాలు, అనాథ పిల్లలకు అందిస్తున్న సేవలు, పొందు తున్న సౌకర్యాలు, విలేజ్‌లో ఉన్న పిల్లలు, వారి సంరక్షణ బాధ్యత చూసే తల్లులు అందిస్తున్న సేవలు తదితరాలపై వివరించారు.

టెన్త్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లోని 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ల్లో 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 14 మంది విద్యార్థులకు స్థానిక సన్ స్కూల్ యాజమాన్యం శనివారం నగదు ప్రోత్సాహ కాలతో పాటు జ్ఞాపికలను అందజేసింది. సన్ స్కూల్ కరస్పాండెంట్ కె.శ్రీనివాస్ నగదు ప్రోత్సాహకాలను తమ పాఠశాలలో అందజేశారు. ఇద్దరికి రూ.5వేలు చొప్పున, మిగిలిన 12 మందికి రూ 3 వేలు చొప్పున నగదు అందజేశారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శివరాణి పాల్గొన్నారు.

పివిటిజిల పథకాల రద్దుపై..

18న ఆదివాసీ దర్బార్‌ను జయప్రదం చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం



నినాదాలు చేస్తున్న నేతలు, గిరిజనులు

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు:పివిటిజిల సంక్షేమ పథకాల రద్దు పై ఈనెల 18న ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాడేరులో జరిగే చలో కలెక్టరేట్- ఆదివాసీ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా శనివారం చింతపల్లి మండలంలోని తాజంగి పంచాయతీ లోని కోరుకొండ పివిటిజి గ్రామంలో యువత, గ్రామస్తులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పివిటిజి తెగలకు సంబంధించిన సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత తుంగలో తొక్కిందని విమర్శించారు. సీసీడీపీ నిధులతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయలేదని మండిపడ్డారు. ఈ నిధులతో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నవరత్నాల పేరుతో పక్కదారి పట్టిస్తుందని విమర్శించారు.పివిటిజిల్లో అర్హులైన పేదలకు రుణాలు, వాహనాలు మంజూరు చేయలేదన్నారు.చలో కలెక్టరేట్ ఆదివాసీ ప్రజా దర్బార్ కార్యక్రమానికి జిల్లాలోని పివిటిజిలు హాజరవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సత్యనారాయణ, నరేష్, వంతల రాఘవకృష్ణ, వంతల ఏసుబాబు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు:మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ పిలుపు మేరకు ఆదివాసి గిరిజన సంఘం నేతలు, పివిటిజిలతో సమావేశం నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.నర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పివిటిజిలకు అంత్యోదయ కార్డులను రద్దు చేసిందని, ఇది దుర్మార్గమైన చర్య అన్నారు. అర్హులైన పివిటిజిలకు అంత్యోదయ కార్డులు తక్షణమే మంజూరు చేయాలని, పివిటిజిలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సిసిడిపి నిధుల ద్వారా వ్యక్తిగత సబ్సిడీ రుణాలు, గ్రామాల్లో సిసి రోడ్లు, మంచినీటి సౌకర్యం, కమ్యూనిటీహాలు, అంగన్‌వాడీ, పాఠశాల భవనాలను నిర్మించాల్సి ఉందన్నారు. ఈ నెల 18న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.త్రినాధ్, మండల వైస్ ఎంపీపీ1 పాటుబోయి సత్యనారాయణ, ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను, పి.భీమరాజు, రామదాసు, కె.శర్భన్న, కొండయ్య, చంద్రయ్య, వీరయ్య, విక్రమ్, నారాయణ సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్, పివిటిజి యువత పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై భారీ ర్యాలీ



ర్యాలీ లో పాల్గొన్న ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి-అరకులోయ:మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలను అరికట్టాలని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యాన శనివారం అరకు లోయలో శాంతి ర్యాలీ నిర్వహించారు.ఈ శాంతిరాలిని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రారంభించారు.క్రైస్తవ ఐక్యవేదిక, యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ ఫెలోషిప్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అరకులోయ ముఖద్వారం లోని ఎన్టీఆర్ గార్డెన్ నుంచి ప్రారంభమైన శాంతి ర్యాలీ రైల్వే స్టేషన్ వరకు కొనసాగింది. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు.మణిపూర్ రాష్ట్రంలో పూర్వ వాతావరణం కల్పించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతియుత వాతావరణం కల్పించాలని క్రైస్తవ సంఘాలు డిమాండ్ చేశాయి.

ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ, మణిపూర్‌లో అఘాయిత్యాలు, మహిళలపై అత్యాచారం వంటి సంఘటనలు కలచివేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిబిఎం ఫీల్డ్ డైరెక్టర్ బిస్సప్ వెయిట్, జోసఫ్, అరకులోయ జడ్పిటిసి శెట్టి రోషిని, ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, క్రైస్తవ ఐక్యవేదిక ప్రతినిధులు సిహెచ్ డేవిడ్, ఒలేసి బాబురావు, బి.ఆనందరావు, ఆర్.రవి, క్రిస్టియన్ మైనారిటీల అల్లూరి జిల్లా అధ్యక్షుడు బిషప్ డాక్టర్ విజయ్ డానియల్ మోడీ, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు వి.ప్రభుదాస్, కె.ఎస్. బాబురావు,పట్టాసి సద్రక్, ఆర్‌సిఎం చర్చి ఫాదర్ ఎం.జేసుదాసు ప్రిన్సిపల్ రాజేశ్వరి, క్రైస్ట్ చర్చి పాస్టర్ ప్రసాద్, హ్యూమన్ రైట్స్ ప్రతినిధి కృష్ణకుమారి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా నేత పి. శాంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

17న ఎఐటియుసి మహాసభ

ప్రజాశక్తి-జి.మాడుగుల:అల్లూరి జిల్లా ఏఐటియుసి మహాసభ ఈనెల 17న పాడేరు జిసిసి డివిజన్ గోడౌన్ ఆవరణలో నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.పండు బాబు శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం మన్మథరావు ఈ సభకు హాజరు కానున్నారని, అన్ని మండలాల హమాలీలు, కార్మికులు, నాయకులు, మేస్త్రిలు పూర్తి స్థాయిలో సభకు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చోడవరం : మండలంలో గోవాడ గ్రామంలో శనివారం విద్యుత్ స్తంభానికి కటౌట్ కడుతుండగా, విద్యుత్ షాక్‌కు గురై అదే గ్రామానికి చెందిన ఏడువాక బంగారు నాయుడు(52) మృతి చెందాడు. గ్రామంలో ప్రధాన కూడలి వద్ద కటౌట్ కడుతుండగా నిచ్చెనకు విద్యుత్ వైరు తగలడంతో షాకు గురయ్యాడు. వెంటనే అనకాపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఫ్యాక్టరీలో సీజనల్ కార్మికుడిగా పనిచేస్తున్న బంగారు నాయుడుకి భార్య, కుమారుడు కుమార్తె ఉన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.

గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- దేవరాపల్లి, చీడికాడ : కారులో గంజాయిని తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను దేవరాపల్లి పోలీసులు శనివారం పట్టుకున్నారు. కారుతో సహా 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ డి నాగేంద్ర కథనం ప్రకారం... ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం నెలతురు గ్రామానికి చెందిన వడ్డెల వాసు (22), వడ్డెల అనీల్ (22), వడ్డెల పెదబాబు (19), రావూరి పవన్ (18)తో పాటు పదిహేడేళ్ల బాలుడు కలిసి కారులో చింతపల్లి మున్యానికి వెళ్లారు. గంజాయి కొనుగోలు చేసి పినకోట, దేవరాపల్లి మీదుగా ప్రకాశం జిల్లాకు వయనమయ్యారు. శ్రీరాంపురం జంక్షన్ వద్ద శనివారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు కారులో గంజాయిని తరలిస్తున్న ఐదుగురు పట్టుబడ్డారు. వెంటనే కారుని తనిఖీ చేయగా, వారి నుండి 6 కేజీల గంజాయి పట్టుబడింది. నిందితులపై కేసు నమోదు చేసి కారుని, గంజాయిని సీజ్ చేశామని, నిందితుల్ని చోడవరం కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ తెలిపారు.

చీడికాడ:మండలంలోని అప్పలరాజు పురం గ్రామంలో పారిపోతున్న వ్యక్తి నుంచి తొమ్మిది కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమకు ముందుగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి చెరకు కాటా వద్ద పహారా నిర్వహిస్తున్నామన్నారు. తమ సిబ్బందిని చూసి ముగ్గురు వ్యక్తులు పారి పోతుండగా వారిని పట్టుకుని ఆరా తీశామని తెలిపారు.ఒక్కొక్కరి వద్ద బ్యాగుల్లో మూడు కేజీల చొప్పున మొత్తం తొమ్మిది కేజీల గంజాయి పట్టుకోవడం జరిగిందని తెలిపారు. ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు రామారావు తెలిపారు.ఈ ముగ్గురు కూడా తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తులు.

నవోదయ కాలేజీ పై నుంచి పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి సుజాతనగర్‌లోని నవోదయ కాలేజీ విద్యార్థిని నాలుగో అంతస్తు నుంచి కిందపడి తీవ్రగాయాలయ్యాయి. నవోదయ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న యశస్విని కాలేజీ భవనం నాలుగో అంతస్తులోని టెర్రస్ నుంచి క్రిందకి పడింది. తీవ్ర గాయాలు కావడంతో కాలేజీ యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విద్యార్థినిని చికిత్స కోసం నగరంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రిన్సిపల్ మురళి మీడియాతో మాట్లాడుతూ, అనారోగ్యం కారణంగానే విద్యార్థిని ఈ అఘాయిత్యానికి పాల్పడిందని చెప్పారు. అయితే పరీక్ష రాస్తున్న సమయంలో విద్యార్థిని మేడ మీదకు ఎందుకు వెళ్లింది అనేదానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పైడితల్లి అమ్మవారి హుండీ చోరీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీ సొమ్ము దొంగలు శుక్రవారం రాత్రి చోరీ చేశారు. దీనిపై ఆలయ ధర్మకర్త బొడ్డు పాలవెల్లి దేవరాపల్లి పోలీస్ స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఎప్పుడు మాదిరిగానే ఆలయంలో పనిచేసే ముప్పిరెడ్డి చెల్లయ్యమ్మ శనివారం ఉదయం 6 గంటలకు వెళ్లి ధూప, దీప నైవేద్యాలు సమర్పిస్తూ గుడి బయట పాదాల వద్ద ఉన్న హుండీ దొంగలపాలైనట్లు గమనించి ఆలయ ధర్మకర్త పాలవెల్లికి సమాచారం ఇచ్చింది. ఆలయ ధర్మకర్త ఆలయ కమిటీ సభ్యులతో ఆలయానికి చేరుకొని పరిశీలించగా, చిరిగిన డబ్బుల నోట్లను అక్కడే విడిచిపెట్టి, హుండీ తాళాలు గుడి వెనుక భాగం చెట్టు కింద వదిలిపెట్టారు. సీసీ కెమెరాలను ముందుగానే గమనించిన దొంగలు కరెంటు కట్ చేసి కెమెరాలను నిలుపుదల చేశారు. గతంలో రెండు, మూడు సార్లు దొంగతనం జరిగినట్లు ధర్మకర్త వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనసేన వారాహి విజయయాత్రలో..

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై మాట్లాడాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జనసేన వారాహి విజయ యాత్రలో స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణపై పవన్ కల్యాణ్ మాట్లాడాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. జనసేన వారాహి విజయయాత్ర పేరిట విశాఖలో సభలు నిర్వహించడాన్ని జెఎసి నేతలు స్వాగతించారు. అయితే ఈ నెల 10 నుంచి జరుగుతున్న సభల్లో స్టీల్‌ప్లాంటు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం గురించి మాత్రం పవన్ ప్రస్తావించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం 900 రోజులకుపైగా విశాఖలోనూ, రాష్ట్ర వ్యాప్తంగానూ ఉద్యమం సాగుతున్న విషయాన్ని పవన్‌కు గుర్తుచేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ఆర్థికంగా దెబ్బతీసి, కావాలని నష్టాల్లోకి నెట్టి ప్రైవేటీకరించే కుట్రలో మోడీ ప్రభుత్వం ఉందన్నారు. తాజాగా అదానీ గంగవరం పోర్టు నుంచి ప్లాంటుకు ఓడల ద్వారా వచ్చే ముడిసరుకు వెళ్లకుండా అడ్డుకుంటోందన్నారు. మరోవైపు రైల్వే, రక్షణరంగం, ఎల్‌ఐసి, బ్యాంకులు, పోర్టు, బిఎస్‌ఎన్ఎల్, ఆయిల్ ఇతర ప్రభుత్వరంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయమైన విశాఖను ఆర్థికంగానూ కేంద్రం దెబ్బతీస్తోందన్నారు. యువత ఉపాధిని దారుణంగా హరిస్తోందన్నారు. మోడీ ప్రభుత్వం యొక్క ఈ ప్రజా ద్రోహంపై పవన్ ఇంతవరకూ జరిగిన బహిరంగ సభల్లో మాట్లాకపోవడం సరైనది కాదన్నారు. అన్యాయం జరిగిన చోట ప్రశ్నిస్తానన్న జనసేన అధినేత బిజెపి ద్రోహాన్ని కూడా నిలదీయాలన్నారు. మిగతా సభల్లోనైనా పై సమస్యలను ప్రస్తావించి విశాఖ ప్రజలకు, యువతకు, కార్మికలకు భరోసా ఇవ్వాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్‌షాల వద్ద తనకున్న పలుకుబడితో స్టీల్‌ప్లాంటు అమ్మకం ఆపే ప్రకటన చేయించాలన్నారు. వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ ఇవ్వాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. అదానీ గంగవరం పోర్టులో కార్మిక చట్టాలు అమలు చేయించాలన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ ఛైర్మన్లు పడాల రమణ, బి.నాగభూషణం, కన్వీనర్లు ఎం.వెంకటేశ్వర్లు, ఎన్.కనకారావు, వై.మస్తానప్ప, జెఎసి నాయకులు దొమ్మేటి అప్పారావు, వి.రామ్మోహన్‌కుమార్, కె.శంకరరావు ఉన్నారు.

భారీగా రైళ్ల రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని ఖుర్దా డివిజన్‌లో మూడో లైన్‌ను ప్రారంభించేందుకు భువనేశ్వర్, మంచేశ్వర్, హరిదాస్‌పూర్ -ధన్మండల్ మధ్య నాన్ - ఇంటర్ లాకింగ్, ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న దృష్ట్యా ఆగష్టు 16 నుంచి 28వ తేదీ వరకూ 96 రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్లలో గౌహతి, హౌరా, షాలిమార్, అగర్తల, భువనేశ్వర్, దిబ్రూగఢ్, కటక్, భాగల్పూర్, సిల్చార్, తిరుపతి, సికింద్రాబాద్, తిరువనంతపురం, బెంగళూరు, నాగర్‌కోయిల్, కోయంబత్తూరు, తిరుచ్చిరాపల్లి, కన్యాకుమారి, పుదుచ్చేరి, ముజఫర్‌పూర్, న్యూటిన్సుకియా, సిల్‌ఘాట్ టౌన్, తాంబరం, వాస్కోడిగామా, రూర్కెలా, గుణపూర్, జగదల్పూర్, టాటా, రామేశ్వరం, ఖరగ్‌పూర్, విల్లుపురం, పురూలియా, న్యూజల్పైగురి, త్రివేంద్రం, పాట్నా, ఎర్నాకులం, సంత్రాగచ్చి, చెన్నయ్ సెంట్రల్, పారదీప్, మైసూర్, మంగళూరు, విశాఖపట్నం, దిఘా, పుణె స్టేషన్‌ల నుంచి పలు రైళ్లు ఉన్నాయి. రద్దయిన రైళ్లలో 90 శాతం రైళ్లు విశాఖ మీదుగా ప్రయాణించేవి ఉన్నాయి. వీటితో పాటు మరో 10 రైళ్ల గమ్య స్థానాలను కుదించారు. ఈ విషయాన్ని గమనించి ప్రయాణికులు సహకరించాలని రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి తెలిపారు.

విజయవాడ డివిజన్‌లో రైళ్ల రద్దు

దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. 17267 కాకినాడ-విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్, 17268 విశాఖపట్నం-కాకినాడ ప్యాసింజర్ ప్రత్యేక రైలు, 07466 రాజమండ్రి-విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్, 07467 విశాఖపట్నం-రాజమండ్రి ప్యాసింజర్ స్పెషల్, 22701 విశాఖపట్నం-విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 విజయవాడ - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 17239 గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను ఆగస్టు 14 నుంచి 20వ తేదీ వరకు, 17240 విశాఖపట్నం-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 15 నుంచి 21 వరకూ రద్దు చేశారు.

32వ వార్డులో 'మహాశక్తి'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపడమే తన ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జ్ గండి బాబ్జీ అన్నారు. నియోజకవర్గంలో నిర్వహిస్తున్న మహాశక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం 32వ వార్డు భీమ్ నగర్, మహారాణిపేట తదితర ప్రాంతాలలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు.

వరద ముంపునకు గురై దెబ్బతిన్న ఇళ్లకు..

పరిహారం కోసం ఎదురుచూపు



విఆర్.పురంలో వరదలకు కూలిన ఇల్లు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-విఆర్.పురం

గత నెలలో సంభవించిన గోదావరి, శబరి వరదల వల్ల ముంపునకు గురై దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం కోసం బాధితులు ఎదురు చూస్తున్నారు. వరద ముంపు వల్ల దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం సర్వే చేసి పరిహారం వచ్చే చర్యలు చేట్టలేదని గోదావరి నది పరివాహక గ్రామాల బాధితులు వాపోతున్నారు. 15 రోజుల పాటు వరద నీటిలో ఇళ్ళ ఉండిపోవడంతో చాలా వరకు దెబ్బతిన్నాయి. కొన్ని నేలమట్టమయ్యాయి. అలాగే ఒండ్రు పట్టాయి. ఆ ఒండ్రు తీయడానికి బాధితులు నానా అవస్థలు పడ్డారు. ఇళ్లను శుభ్రం చేసుకోవడం కోసం, సామానులు తిరిగి ఇళ్లకు తీసుకెళ్లడానికి ఒక్కో కుటుంబానికి రూ.10 వేలకు పైగా ఖర్చులయ్యాయని, దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడినట్లు బాధితులు చెబుతున్నారు.

రెండు వారాలకు పైగా కొండలు, గుట్టలు, ఎత్తైన ప్రాంతాల్లో గుడారాలు వేసుకొని, పునరావాస కేంద్రాల్లో ఉంటే ప్రభుత్వం ఒక్కసారి మాత్రమే కూరగాయలు ఇచ్చిందని అంటున్నారు. వరద చుట్టుముట్టిన దగ్గర నుండి 15 రోజుల పాటు ఇళ్లను విడిచి సామానులు పట్టుకొని గుట్టలెక్కిన బాధితులు, వరద తీశాక ఇంటికొస్తే రూ.2వేలు చేతిలో పెట్టి ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 7న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కునవరం పర్యటన సందర్భంగా వరదలకు దెబ్బతిన్న ఇళ్లకు రూ.20వేలు, పూర్తిగా పడిపోయిన ఇళ్లకు రూ.90 వేలు పరిహారం ఇస్తామని ప్రకటించారు. కాని ఇంతవరకు అందుకు సంబంధించిన ప్రక్రియ అధికారులు ప్రారంభించలేదన్న విమర్శలు సర్వత్రా జనం నుండి వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు వరద ముంపునకు గురై దెబ్బతిన్న ఇళ్లను గుర్తించి పరిహారం చెల్లించాలని బాధితులు కోరుతున్నారు.

ఫేషియల్ రికగ్నైజెడ్ యాప్‌ను రద్దు చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

ప్రజాశక్తి-మారేడుమిల్లి

రాష్ట్రంలో అంగన్వాడీ వర్కర్లకు పని భారం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫేషియల్ రికగ్నైజెడ్ యాప్ అంగన్వాడీ కార్యకర్తలను చాలా ఒత్తిడికి గురి చేస్తుందని, తక్షణమే ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. 'ప్రభుత్వ విధానాలు -కార్మికుల ప్రభావం' అనే అంశంపై మారేడుమిల్లిలో శనివారం జరిగిన సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ జన్మోహన్‌రెడ్డి ఎన్నికలకు మందు ఇచ్చిన హామీలకు, ఇప్పుడు చేస్తున్న చేష్టలకు సంబంధం లేదని విమర్శించారు. పనిచేయని, 2జిబి ఫోన్లు అంగన్వాడీ కార్మికులకు ఇచ్చి, నెట్ పనిచేయని ఏజెన్సీ ప్రాంతంలో ఫేషియల్ రికగ్నైజ్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రకరకాల యాప్‌లు తీసుకొచ్చి అంగన్వాడీ కార్మికులపై పనిభారం మోపిందని, వారు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు చేసిన పనికి తగిన వేతనాలు ఇవ్వకుండా అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో అమలు జరుగుతున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు రత్నకుమారి, ప్రసూన, హైమావతి, బేబీ, ప్రశాంతి, స్వరూప, మంగమ్మ, రమణ, మల్లమ్మ, పరమేశ్వరి, లలిత తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బేబిరాణి

శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబి రాణి డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో శ్రామిక మహిళా విశాఖ జిల్లా సదస్సు ఎల్ఐసి యూనియన్ నాయకులు సూర్యప్రభ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా హాజరైన బేబి రాణి మాట్లాడుతూ శ్రామిక మహిళలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజు రోజుకూ పని భారం పెంచుతున్నాయన్నారు. వారికి ఏ విధమైన కార్మిక చట్టాలూ అమలు చేయకుండా, అత్యంత తక్కువ వేతనాలతో వారి శ్రమను దోచుకుంటున్నాయన్నారు. పేదలకు సహాయం అందిస్తున్నటువంటి అనేక పథకాల్లో మహిళా కార్మికులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. వారు వివక్షతకు గురౌతున్నారని తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల హక్కులను కాలరాస్తోందన్నారు. మహిళలను వంట ఇంటికే పరిమితం చేయాలనే మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. మహిళలకు రాత్రివేళల్లో డ్యూటీలు వేయకూడదని చట్టాలున్నా అమలు చేయడం లేదన్నారు. సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కార్యదర్శి పి.మణి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తులసి, దేవి, ఆశా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, మేరీ, మిడ్డేమీల్స్ యూనియన్ కార్యదర్శి మంగశ్రీ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అనసూయ, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి బి.రత్నం, ఎల్‌ఐసి డివిజన్ అధ్యక్షులు ఎం.కామేశ్వరి ఆర్‌పిల యూనియన్ అధ్యక్షులు అలివేణి, హాస్పిటల్స్, షాప్స్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఇంటిపనివారు, ఇతర సంఘాల నుంచి శ్రామిక మహిళా నాయకులు హాజరయ్యారు.

మోడీ పాలనలో కార్మిక వర్గంపై పెరిగిన దాడులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మోడీ పాలనలో దేశ వ్యాప్తంగా కార్మిక వర్గంపై దాడులు పెరిగాయని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. సంఘం విశాఖ జిల్లా 13వ మహాసభలు ప్రారంభం సందర్భంగా శనివారం సరస్వతీ పార్క్ నుంచి డాబా గార్డెన్స్ మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రధానిగా వచ్చిన తర్వాత 155 లక్షల కోట్లు అప్పు చేసి దేశ ప్రతిష్టను దిగజార్చారని ఆరోపించారు. దేశం మూడో ఆర్థిక శక్తిగా అవతరిస్తోందని చెప్పిన ప్రధాని నేడు ఎందుకు ఆకలి చావులు అధికంగా ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణాల బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేయడానికి మోడీ కుట్రలు చేస్తున్నారు. ఈ అంశంపై మాట్లాడాల్సిన అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి, జనసేన ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, జిల్లా అధ్యక్షులు పడాల రమణ, ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.మసేన్, రాష్ట్ర కార్యదర్శి జి.వామనమూర్తి పాల్గొన్నారు.

27న శబరిమల సమాచార కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 27న శబరిమల సమాచార కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచారసభ జాతీయ అధ్యక్షులు కె.అయ్యప్పదాన్, ప్రధాన కార్యదర్శి వై.బాలాంజనేయులు తెలిపారు. శనివారం సాయంతం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివారం విశాఖ శంకరమఠంలో సంఘం జాతీయ కార్యవర్గ ఎన్నిక జరగనుందని తెలిపారు. దక్షిణ భారతదేశంలోని 5 రాష్ట్రాలలోని సభ్యులు పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు నాగార్జున, కార్యదర్శి నరహరి, కృష్ణయ్య, తాతినాయుడు పాల్గొన్నారు.